నమస్తే తెలంగాణ
కామారెడ్డి
10 నిజామాబాద్, ఆదివారం 12 మే 2024 KAMAREDDY


# ప్రజలకు మేలుచేసే బీఆర్ఎస్‌ను గెలిపించాలి

**జహీరాబాద్ లోక్‌సభ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్**

రామారెడ్డి/ రాజంపేట్, మే 11: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, ప్రజలకు మేలు చేసే బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని జహీరాబాద్ లోక్‌సభ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ అన్నారు. రామారెడ్డి, పోసానిపేట్, ఉప్పల్‌వాయి, రాజంపేట్ మండలం కొండాపూర్ తదితర గ్రామాల్లో శనివారం నిర్వహించిన రోడ్‌షోలో ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమలుకు సాధ్యంకాని హామీలతో కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని, ఈసారి మోసపోకుండా కారు గుర్తుకు ఓటేసి తనను ఆశీర్వదించాలని కోరారు.



రాజంపేట మండలం కొండాపూర్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, పక్కన మాజీ ఎమ్మెల్యే జాజాల



దేశాయ్‌పేట్‌లో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి

# వచ్చేది సంకీర్ణ ప్రభుత్వమే..

- కాంగ్రెస్ అబద్ధాల కోరు.. బీజేపీ ధోకాబాజీ పార్టీ
- బీజేపీకి 200సీట్లు దాటవు..
- మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి

బాన్సువాడ, మే 11: దేశంలో వచ్చేది సంకీర్ణ ప్రభుత్వమేనని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డితో కలిసి బాన్సువాడలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశంలోని ఆయా రాష్ట్రాల ప్రాంతీయ పార్టీలు ఏకమై సంకీర్ణ ప్రభుత్వానికి నాంది పలుకుతాయని, బీజేపీకి 200 సీట్లు కూడా దాటవని చెప్పారు. బీజేపీ పేద ప్రజలకు చేసిందేమీ లేదని, అదానీ, అంబానీలకు రూ.15లక్షల కోట్లను మాఫీ చేసిందని అన్నారు. బీజేపీ మత విద్వేషాలను ఉసిగొల్పుతూ, యువతను రెచ్చగొట్టే కార్యక్రమాలు చేపడుతున్నదని అన్నారు. బీజేపీకి ఒక ఆయోధ్య రామమందిరం తప్ప, ఎజెండా లేదన్నారు. తెలంగాణలో నలుగురు బీజేపీ ఎంపీలుండి రాష్ట్రానికి చేసిన అభివృద్ధి ఏంటో చెప్పాలని సవాల్ విసిరారు. రాష్ట్రం నుంచి పన్ను రూపేనా కేంద్రానికి రూ. 3లక్షల కోట్లు చెల్లిస్తే, రాష్ట్రానికి ఇచ్చింది రూ.లక్షా60 కోట్లు మాత్రమే అని తెలిపారు. మోదీ సబ్ కా వినాష్ చేస్తున్నారని సొంత పార్టీ ఎంపీ అభ్యర్థి ఉమాభారతి అన్నారని, దాన్ని బట్టి చూస్తే బీజేపీ రోజు రోజుకూ ప్రజల్లో విశ్వాసం కోల్పోతున్నదని చెప్పారు. రిజర్వేషన్లను రద్దు చేస్తామని, రాజ్యాంగాన్ని తిరుగరాస్తామని చెప్పడం ఎంత వరకు సబబు అని, రాజ్యాంగం రాసిన అంబేద్కర్‌ను అవమానపర్చడమే అని, పేద ప్రజల హక్కు రాజ్యంగమని వివరించారు.

**కాంగ్రెస్ అబద్ధాల పార్టీ..**

గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశారని, ఐదు నెలలోనే కాంగ్రెస్ పార్టీ అబద్ధాల పార్టీ అని ప్రజలు గ్రహించారని పోచారం అన్నారు. బీఆర్ఎస్ పార్టీ 10 నుంచి 12 స్థానాల్లో గెలువబోతున్నదని ధీమా వ్యక్తంచేశారు. ఎన్నికల తర్వాత రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు మారబోతున్నాయని చెప్పారు. 13న నిర్వహించే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్ కుమార్‌ను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తిచేశారు. బాన్సువాడ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి 50 వేల మెజార్టీ వస్తుందని, ఎంపీ స్థానాన్ని లక్షా50 వేల మెజార్టీతో గెలుస్తున్నామని చెప్పారు. ముస్లిములు మంచి ఆలోచన చేయాలని, కాంగ్రెస్‌కు ఓటేస్తే బీజేపీ గెలుస్తుందన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి, కాంగ్రెస్ పార్టీకి మధ్య ఓట్ల వ్యత్యాసం కేవలం 1.8శాతమేనని, ప్రస్తుత సర్వేల ప్రకారం కాంగ్రెస్ పార్టీ కన్నా బీఆర్ఎస్ పార్టీ 8శాతం ఓట్లతో ముందంజలో ఉన్నదని, ఫలితాలు తారుమారవుతాయని చెప్పారు. కష్టపడి పనిచేసిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు పోచారం ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ డాక్టర్ అంజిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు ఏర్వాల కృష్ణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మోహన్‌నాయక్, మహ్మద్ ఎజాస్, అమేర్ చాహూస్, మైనార్టీ ఫంక్షన్ హాల్ అధ్యక్షుడు వాహాబ్, కొర్ల పోతురెడ్డి పాల్గొన్నారు.

# పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

**కలెక్టర్ జితేశ్ వీ పాటిల్**

కామారెడ్డి, మే 11: ఈనెల 13న నిర్వహించే లోక్‌సభ పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మొత్తం 6,80,921 ఓటర్లు ఉండగా, అందులో పురుషులు 3,28,879 మంది, స్త్రీలు 3,52,012 మంది, 30 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 913 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా, 64 సమస్యాత్మక ప్రాంతాల్లో 183 పోలింగ్ కేంద్రాలను గుర్తించి భద్రతా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆదివారం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి 1977 బ్యాలెట్ యూనిట్లు, 987 కంట్రోల్ యూనిట్లు, 1,107 వీవీ ప్యాట్లు, ఎన్నికల సామగ్రి, సిబ్బందిని 94రూట్ల ద్వారా పోలింగ్ కేంద్రాలకు తరలిస్తామని వివరించారు. ఇప్పటివరకు రూ. కోటీ 92 లక్షల నగదు, రూ.15.85 లక్షల విలువగల 7,045 లీటర్ల మద్యం, రూ.16.50 లక్షల విలువగల గంజాయి, బంగారం పట్టుకొని కేసులు నమోదు చేశామని పేర్కొన్నారు. సీ-విజిల్, టోల్‌ఫ్రీ ద్వారా వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించామని తెలిపారు. హోమ్ ఓటింగ్‌లో 419 మం ది సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు పాల్గొన్నారని, ఎన్నికల విధులు నిర్వహిస్తున్న 4,060 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారని తెలిపారు. 13న నిర్వహించే పోలింగ్‌కు ఎన్నికల సంఘం గుర్తించిన 12గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకదానితో వెళ్లి ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని ఓటర్లకు సూచించారు.

**ఏర్పాట్ల పరిశీలన**

మద్నూర్/ ఎల్లారెడ్డి రూరల్, మే 11: లోక్‌సభ పోలింగ్ ఏర్పాట్లను కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ శనివారం పరిశీలించారు. మద్నూర్ జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలోని ఈవీఎం స్ట్రాంగ్‌రూంతోపాటు డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని సందర్శించారు. ఏర్పాట్లపై జుక్కల్ అసెంబ్లీ సెగ్మెంట్ రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సలాబత్‌పూర్ చెక్‌పోస్టును సందర్శించారు. ఎల్లారెడ్డి మండల కేంద్రంలోని జీవదాన్ పాఠశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని పరిశీలించి ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తంచేశారు.



మద్నూర్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

